పివిటిలో సద్దుల బతుకమ్మ సంబరాలు

విశ్వంభర, ఎల్బీనగర్ : కొత్తపేట పద్మ వంశీ హ్యాండ్లూమ్ అండ్ టెక్స్టైల్ మార్కెట్లో సద్దుల బతుకమ్మ ఉత్సవాలు ఆదివారం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని మార్కెట్ ఫౌండర్స్ కమిటీ అధ్యక్షులు భారత పురుషోత్తం , సభ్యులు జెల్ల లక్ష్మీనారాయణ , రచ్చ కృష్ణమూర్తి , మర్చంట్ కమిటీ సభ్యులు అధ్యక్షులు బొడ్డు శ్రీధర్ , ఉపాధ్యక్షులు తడక కృష్ణ, రాపోలు సురేష్, సెక్రటరీ భారత రాజేంద్రప్రసాద్ , జాయింట్ సెక్రటరీ రచ్చ రాజు , కోశాధికారి నామని ధనుంజయ , కమిటీ సభ్యులు చెరుకుపల్లి పాండురంగం , విడం ప్రకాష్ , సీత మధుసూదన్ , జెల్ల వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

8.5 ఓవర్లలోనే టార్గెట్ ఫినిష్.. టీ20 సిరీస్ భారత్‌దే

రాయ్‌పుర్: జింబాబ్వేతో టీ20 సిరీస్‌ను భారత మహిళల జట్టు 20తో కైవసం చేసుకుంది. రెండో టీ20 మ్యాచ్‌లో భారత్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 103 పరుగుల లక్ష్యాన్ని 8.5 ఓవర్లలోనే ఒక వికెట్ కోల్పోయి ఛేదించింది. షెఫాలీ వర్మ హాఫ్ సెంచరీ చేసి సత్తా చాటింది. ఆమె 25 బంతుల్లో 55 రన్స్ చేసి బిజా బౌలింగ్‌లో ఔటయ్యింది. స్మృతి మంధాన 47* రన్స్‌తో (25 బంతుల్లో) దూకుడుగా ఆడింది. చివర్లో అనుష్క శర్మ 1* రన్ చేసింది.అంతకు ముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న జింబాబ్వే మహిళల జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 102/8 పరుగులు చేసింది. ముగేరి తిరిపనో 34, జోసెఫైన్ 27* రన్స్ చేశారు. మిగతా బ్యాటర్లెవరూ అంతగా రాణించలేదు. భారత బౌలర్లలో నిక్కీ ప్రసాద్ 2 వికెట్లు పడగొట్టింది. క్రాంతి గౌడ్, నందనీ శర్మ, దీప్తి శర్మ, శ్రీచరణి తలో వికెట్ తీశారు. నామమాత్రపు మూడో టీ20 మ్యాచ్ రాయ్‌పుర్‌లో అక్టోబర్ 20న జరగనుంది.

మహ్మద్ రిజ్వాన్‌కు పీసీబీ ఊరట

విశ్వంభర, స్పోర్ట్స్ : ఆన్‌లైన్ బెట్టింగ్, జూదం, డ్రెస్సింగ్ రూమ్ సమాచార లీక్ ఆరోపణలపై విచారణ ఎదుర్కొంటున్న పాకిస్థాన్ క్రికెట్ జట్టు స్టార్ వికెట్ కీపర్, బ్యాటర్ మహ్మద్ రిజ్వాన్‌కు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తొలిసారిగా భారీ ఉపశమనం కల్పించింది. ఆయనపై విధించిన ఆంక్షలను సడలిస్తూ మళ్లీ డొమెస్టిక్ క్రికెట్ ఆడేందుకు పీసీబీ అధికారికంగా అనుమతినిచ్చింది. అక్టోబర్ 19 నుంచి ప్రారంభం కానున్న ప్రతిష్ఠాత్మక 'ప్రెసిడెంట్స్ కప్' ఫస్ట్ క్లాస్ టోర్నమెంట్‌లో రిజ్వాన్ బరిలోకి దిగనున్నారు. సుయ్ నార్తర్న్ గ్యాస్ పైప్‌లైన్స్ లిమిటెడ్ జట్టుకు రిజ్వాన్ నాయకత్వం వహించనున్నట్లుగా ఆ జట్టు హెడ్ కోచ్, పాకిస్థాన్ మాజీ కెప్టెన్ మహ్మద్ హఫీజ్ ధృవీకరించారు. ఈ మేరకు పీసీబీ డొమెస్టిక్ డిపార్ట్‌మెంట్ నుంచి తమకు అధికారిక ఈమెయిల్ అందినట్లుగా ఆయన వెల్లడించారు.కాగా, గత ఆగస్టులో ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో టెస్టు మ్యాచ్ అనంతరం రిజ్వాన్, మరో ప్లేయర్ ఇమామ్‌ఉల్‌హక్‌లను హుటాహుటిన స్వదేశానికి రప్పించిన పీసీబీ వారిని డొమెస్టిక్ క్రికెట్ ఆడకుండా నిషేధించింది. డ్రెస్సింగ్ రూమ్ సమాచారం లీక్ చేయడం, ఆన్‌లైన్ బెట్టింగ్, జూదానికి పాల్పడినట్లుగా వస్తున్న ఆరోపణలపై నేషనల్ సైబర్ క్రైమ్ సెల్ వీరిపై విచారణ చేపట్టింది. విచారణలో భాగంగానే మ్యాచ్ సమయంలో వారి ఫోన్లను కూడా భద్రతా సిబ్బంది స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ పరీక్షలకు పంపారు. గతంలో రెండుసార్లు ఎన్‌సీసీఏ ఎదుట విచారణకు హాజరైన రిజ్వాన్ ఇటీవల అక్టోబర్ 10న లాహోర్‌లో మరోమారు విచారణ సెషన్‌లో పాల్గొనగా తాజాగా డొమెస్టిక్ క్రికెట్ ఆడేందుకు సూచనాప్రాయంగా ఆమోదం తెలిపినట్లుగా తెలుస్తోంది.

చక్కెరకు కేంద్రం రక్షణ.. చెరకు ఇథనాల్‌కు బ్రేక్

విశ్వంభర, బిజినెస్ బ్యూరో: దేశంలో ఆహార ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచుతూ, చక్కెర నిల్వలను పరిరక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 202627 ఆర్థిక సంవత్సరానికి (నవంబర్ 2026-అక్టోబర్ 2027) గాను ఇథనాల్ సరఫరా కోసం ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీ) విడుదల చేసిన 11 బిలియన్ లీటర్ల తాజా టెండర్‌లో చెరకు రసం, చక్కెర సిరప్, బీహెవీ మొలాసిస్ నుండి తయారుచేసే ఇథనాల్‌పై నిషేధం విధించాయి. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో తక్కువ వర్షపాతం కారణంగా చెరకు దిగుబడి తగ్గే సూచనలు ఉండటంతో, ఇంధన ఉత్పత్తి కంటే దేశీయ చక్కెర అవసరాలకే ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం ఈ ఆదేశాలిచ్చింది. దీనికి తోడు, మొక్కజొన్న ఆధారిత ఇథనాల్‌పై ఇచ్చే ప్రోత్సాహకాన్ని లీటరుకు రూ. 5.79 నుండి రూ. 2.79కి తగ్గించడంతో దాని సేకరణ ధర రూ. 68.86కు పడిపోయింది. ప్రస్తుతం పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ (ఈ20) కలిపే లక్ష్యాన్ని సాధించడానికి ఆయిల్ కంపెనీలు ఇకపై ఎఫ్‌సీఐ మిగులు బియ్యం, నూకలు, సీహెవీ మొలాసిస్ వంటి ప్రత్యామ్నాయ ధాన్య ఆధారిత ఫీడ్‌స్టాక్‌లపైనే ప్రధానంగా ఆధారపడనున్నాయి.

ఐపీఎల్ వేలంలో షై హోప్ కోసం ఆ నాలుగు టీమ్‌లు?

విశ్వంభర, స్పోర్ట్స్ : ఇంటర్నెట్ డెస్క్: భారత్‌తో పరిమిత ఓవర్ల సిరీసుల్లో అదరగొట్టిన షై హోప్ ఇప్పుడు హాట్ కేక్‌లాంటి క్రికెటర్. పొట్టి ఫార్మాట్‌లో నూ రెండు సెంచరీలు సాధించి సత్తా చాటాడు. ఓపెనర్‌గా వస్తూ దూకుడు ప్రదర్శించడంతోపాటు ఇన్నింగ్స్‌ను చివరి వరకూ తీసుకెళ్లే నైపుణ్యం షై హోప్ సొంతం. దీంతో వచ్చే ఐపీఎల్ సీజన్‌లో అతడి కోసం నాలుగు జట్లు పోటీ పడతాయని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. ఐపీఎల్ 2027 సీజన్ కోసం డిసెంబర్‌లో వేలం ఉంటుందనే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే.

అప్పుడు ఆడినా..

ఐపీఎల్‌కు షై హోప్ కొత్తేమీ కాదు. రెండేళ్ల కిందట ఇక్కడ అడుగు పెట్టిన అతడు ఇప్పటి వరకు తొమ్మిది మ్యాచులు ఆడాడు. కేవలం 183 పరుగులు మాత్రమే చేశాడు. దిల్లీ క్యాపిటల్స్ తరఫున బరిలోకి దిగాడు. ఒక్క హాఫ్ సెంచరీ కూడా లేదు. కానీ, ఈసారి పరిస్థితి పూర్తిగా భిన్నమైంది. ఇప్పుడు మంచి ఫామ్‌లో ఉన్నాడు. ఇక దూకుడుగా ఆడుతూ పరుగులు రాబట్టేస్తున్నాడు. భారత్‌తో వన్డేలు, టీ20ల్లో నాలుగు సెంచరీలు సహా 500+కిపైగా పరుగులు చేశాడు.

ఎవరు ఆసక్తిగా ఉన్నారంటే..

చెన్నై సూపర్ కింగ్స్‌కు నమ్మకమైన విదేశీ ఓపెనర్ అవసరం ఉంది. మొన్నటి వరకూ దేవన్ కాన్వే ఉండేవాడు. ఇప్పుడు అతడి ప్లేస్‌లో మరొకరిని తీసుకోవాల్సి ఉంది. షై హోప్ పట్ల ధోనీ కూడా ఆసక్తిగా ఉన్నాడని గతంలో వార్తలు వచ్చాయి.

మరోసారి హోప్‌ను తీసుకొనేందుకు దిల్లీ క్యాపిటల్స్ ఆసక్తి చూపించొచ్చని ఐపీఎల్ వర్గాలు పేర్కొన్నాయి.

రాజస్థాన్ రాయల్స్ కూడా తమ బ్యాకప్ ఓపెనర్‌గా హోప్‌ను తీసుకొనేందుకు ఆలోచనలు చేస్తున్నట్లు సమాచారం. యశస్వి వైభవ్‌కు బ్యాకప్ విదేశీ ఓపెనర్‌గా అవసరం రాజస్థాన్‌కు ఉంది.

గుజరాత్ టైటాన్స్‌కు శుభ్‌మన్ గిల్ సాయి సుదర్శన్ ఓపెనింగ్ జోడీ ఉంది. మూడో స్థానంలో జోస్ బట్లర్ ఉన్నాడు. కానీ, బ్యాకప్ ఓపెనర్‌గా ఎవరూ లేరు. దీంతో జీటీ కూడా హోప్ కోసం బరిలోకి దిగొచ్చు.

ఏ స్థానంలో అయినా ఆడేందుకు సిద్ధమే: తిలక్ వర్మ

విశ్వంభర, స్పోర్ట్స్ : టీ20ల్లో మూడో స్థానం నుంచి ఐదు, ఆరో స్థానాల్లో వచ్చి బ్యాటింగ్ చేయడం అంత సులువు కాదని భారత వైస్ కెప్టెన్ తిలక్ వర్మ అన్నాడు. జట్టు అవసరాల కోసం ఫినిషర్‌గా రాణించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపాడు. నిరంతరం సాధన చేస్తూ ఏ స్థానంలోనైనా ఆడేందుకు సిద్ధమవుతున్నట్లు వెల్లడించాడు. ఆటతీరును మెరుగుపరచుకునేందుకు నెట్స్‌లో సాధన చేస్తున్నట్లు చెప్పాడు. వెస్టిండీస్‌తో ఐదో టీ20 వర్షం కారణంగా రద్దైన అనంతరం శనివారం తిలక్ మీడియాతో మాట్లాడాడు.

"దేశం తరఫున ఆడుతూ మ్యాచ్‌లను ఫినిష్ చేయడం నాకు ఎంతో ఇష్టం. మూడో స్థానంలో బ్యాటింగ్ చేయడం సులువే. కానీ, ప్రస్తుతం జట్టులో కొన్ని మార్పుల కారణంగా ఐదు, ఆరో స్థానంలో ఆడాల్సి వస్తోంది. ఇషాన్ కిషన్ మూడో స్థానంలో అద్భుతంగా ఆడుతున్నాడు. అందుకే ఐదు, ఆరు స్థానాల్లో జట్టు కోసం నా బాధ్యతను నిర్వర్తించేందుకు సిద్ధమయ్యా" అని తిలక్ పేర్కొన్నాడు. ఫినిషర్‌గా రాణించేందుకు ఎంతో శ్రమిస్తున్నట్లు తిలక్ తెలిపాడు. "ఐదు, ఆరు స్థానాల్లో బ్యాటింగ్‌కు దిగితే ఐదారు ఓవర్లు మాత్రమే ఆడే అవకాశం ఉంటుంది. అందుకు తగినట్లు వేగంగా ఆడేందుకు సిద్ధంకావాలి. అంతర్జాతీయ స్థాయిలో ఆడే క్రికెటర్లకు మానసిక దృఢత్వం చాలా అవసరం." అని తిలక్ చెప్పాడు. వెస్టిండీస్ తో సిరీస్‌లో ప్రతి మ్యాచ్‌లోనూ భారత జట్టు 200కుపైగా పరుగులు చేయడం మంచి పరిణామమని తిలక్ తెలిపాడు. సరైన ఆల్‌రౌండర్ లేకున్నా నితీశ్ , శివమ్ దూబె తమవంతుగా రాణించారని చెప్పాడు. నమన్ ధీర్ ఆఫ్ స్పిన్‌తో బాగా బౌలింగ్ ఆకట్టుకొన్నాడని ప్రశంసించాడు. త్వరలో న్యూజిలాండ్ తో జరిగే సిరీస్‌లో మెరుగైన ప్రదర్శన చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశాడు.

మాకు ఆర్థికంగా చేయూతనివ్వండి

విండీస్ కోచ్ డారెన్ సామీ విజ్ఞప్తి

విశ్వంభర, స్పోర్ట్స్ : భారత్‌తో సిరీస్ ఆడటం వల్ల తమకు ఎలాంటి ఆదాయం రాదని ఇటీవల వెస్టిండీస్ క్రికెట్ బోర్డు సీఈవో డెహ్రింగ్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. విదేశాల్లో తమ జట్టు ఆడటం వల్ల భారీగానే రెవెన్యూ వచ్చినా.. తమకు ప్రయోజనం లేకుండా పోతోందని పేర్కొన్నారు. ఈ క్రమంలో వెస్టిండీస్ ప్రధాన కోచ్ డారెన్ సామీ ఓ విజ్ఞప్తి చేశాడు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో కుదేలైన తమకు చేయూతనివ్వాలని కోరాడు. భారత్‌తో సిరీస్ హోరాహోరీగా సాగిందని.. ఇదే రాబోయే కాలంలో స్పాన్సర్లతో మరింత అర్థవంతమైన చర్చలు జరిపేందుకు తమకు అవకాశం కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. "మా అమ్మ ఎప్పుడూ ఒక మాట చెప్పేవారు. బాధ్యతాయుతమైన శ్రద్ధ ఉండాలి. ఏ పని చేసినా దానిని మాత్రం కోల్పోకూడదు. ఇప్పుడు విండీస్ క్రికెట్ కూడా ఇదే పరిస్థితుల్లో ఉందని అనుకుంటున్నా. ఆర్థిక మద్దతు మాకు అత్యంత అవసరం. ప్రపంచంలోనే అత్యుత్తమ టీమ్‌తో హోరాహోరీగా ఆడాం. సిరీస్‌ను నెగ్గేందుకు చాలా చేరువగానే వచ్చాం" అని సామీ తెలిపాడు.

ఎన్నో కష్టాలను ఎదుర్కొని..

"భారత జట్టు ఏదైనా ఐసీసీ ఈవెంట్‌లో పాల్గొన్న ప్రతిసారీ గెలుస్తుందని అభిమానులు ఆశిస్తారు. టీమ్‌ఇండియా కూడా అందుకు తగినవిధంగా సిద్ధమవుతుంది. అదే మా జట్టు విషయానికొస్తే.. అనేక ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని మరీ రాణించాల్సి ఉంటుంది. ఇప్పుడు భారత్‌తోనూ మా కుర్రాళ్లు అద్భుతంగా ఆడారు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో రాణించగలమనే నమ్మకం తిరిగి వచ్చింది. విజయం సాధించాలనే పట్టుదల ప్రదర్శించడం అభినందనీయం. డ్రెస్సింగ్ రూమ్‌ను మరింత ఉత్సాహంగా ఉంచేలా చేయడమే కోచ్‌గా నా బాధ్యత. చివరి మ్యాచ్‌లోనూ గెలిచి.. సుదీర్ఘ కాలం తర్వాత సిరీస్‌ను సొంతం చేసుకోవాలని భావించాం. ఆ మైండ్‌సెట్‌తోనే బరిలోకి దిగాం. ఇదే ఆత్మవిశ్వాసంతో మున్ముందు నాణ్యమైన ప్రదర్శన ఇచ్చేందుకు ప్రయత్నిస్తాం" అని సామీ స్పష్టం చేశాడు.

చీఫ్ సెలక్టర్ పదవి.. మూడు కోట్ల వేతనం కూడా సరిపోలేదా?

విశ్వంభర, స్పోర్ట్స్ : భారత క్రికెట్ జట్టు చీఫ్ సెలక్టర్‌గా ఎంపికైతే రూ. 3 కోట్ల వరకూ పారితోషికం వస్తుంది. విదేశాలతో పాటు స్వదేశంలో మ్యాచులను చూసేందుకు అయ్యే ఖర్చునూ బీసీసీఐ భరిస్తుంది. వీటన్నింటిని సొంతం చేసుకొనే అవకాశం పార్థివ్ పటేల్‌కు వచ్చేదే. అతడు వెస్ట్ జోన్ సెలక్టర్ పదవికి దరఖాస్తు చేసుకొని ఉంటే కచ్చితంగా సెలక్షన్ కమిటీకి చీఫ్ అయ్యేవాడే. అతడు 25 టెస్టుల్లో భారత్ తరఫున ఆడాడు. కానీ, భారీ మొత్తాన్ని వద్దనుకొని మరీ 'సెలక్టర్' పదవికి దరఖాస్తు చేయలేదు. అందుకు వివిధ కారణాలు ఉన్నాయంటూ వార్తలు వస్తున్నాయి. మరీ ముఖ్యంగా ఆర్థిక అంశాల వల్లే పార్థివ్ విముఖత ప్రదర్శించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పార్థివ్ పటేల్ కామెంట్రీతోపాటు గుజరాత్ టైటాన్స్‌కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. ఒకవేళ చీఫ్ సెలక్టర్ అయితే వీటన్నింటినీ వదిలేయాలి. చీఫ్‌గా రూ. 3 కోట్లు అందుకొనే వీలున్నా సరే.. తన కమిట్‌మెంట్‌ల ద్వారా అంతకంటే ఎక్కువ ఆదాయం పార్థివ్‌కు వస్తుండటమే విముఖతకు ప్రధాన కారణంగా క్రికెట్ విశ్లేషకులు అంచనా వేశారు.

రమేశ్ పొవార్‌కే ఛాన్స్..

వెస్ట్ జోన్ నుంచి సెలక్టర్ పదవి కోసం ఇద్దరు ప్రధానంగా పోటీ పడుతున్నారు. మాజీ క్రికెటర్లు వసీమ్ జాఫర్, రమేశ్ పొవార్ దరఖాస్తు చేసుకున్న వారిలో ముందున్నారు. అయితే, రమేశ్ పొవార్ నియామకం దాదాపు ఖాయమైందనే వార్తలు వస్తున్నాయి. ఒకవేళ జాఫర్ ఎంపికైతే మాత్రం చీఫ్ సెలక్టర్ పదవి అతడినే వరించేది. ప్రజ్ఞాన్ ఓజా 24 టెస్టులు ఆడితే.. జాఫర్ 31 టెస్టులు ఆడాడు. పొవార్ కేవలం 2 టెస్టుల్లోనే ప్రాతినిధ్యం వహించాడు. పొవార్ రాకతో చీఫ్ సెలక్టర్‌గా ప్రజ్ఞాన్ ఓజా బాధ్యతలు తీసుకోవడం ఖాయం. ప్రస్తుతానికి ఓజానే తాత్కాలిక చీఫ్ సెలక్టర్.

భారత వృద్ధి అంచనాను 7.3 శాతానికి పెంచిన డెలాయిట్

విశ్వంభర, బిజినెస్ బ్యూరో: దేశంలో ప్రజల కొనుగోలు శక్తి పుంజుకోవడం, కంపెనీల ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉండటంతో 202627 ఆర్థిక సంవత్సరంలో మన దేశ ఆర్థిక వృద్ధి రేటు 7.1 నుండి 7.3 శాతంగా నమోదవుతుందని ప్రముఖ కన్సల్టింగ్ సంస్థ డెలాయిట్ ఇండియా అంచనా వేసింది. గతంలో ఇచ్చిన 6.56.8 శాతం అంచనాతో పోలిస్తే ఇది గణనీయమైన పెంపు. గత ఆరు త్రైమాసికాలుగా దేశంలోని ఫ్యాక్టరీలు 75.7 శాతానికి పైగా సామర్థ్యంతో పనిచేస్తుండటంతో, వ్యాపారాలను విస్తరించేందుకు కొత్తగా భారీగా పెట్టుబడులు పెట్టడానికి కంపెనీలు ముందుకు వస్తున్నాయి. భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) అంచనాల ప్రకారం ప్రైవేట్ కంపెనీలు పెట్టే పెట్టుబడులు రాబోయే ఏడాదిలో రూ. 2.6 లక్షల కోట్ల నుండి రూ. 3.2 లక్షల కోట్లకు పెరగనున్నాయి. అయితే, ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న యుద్ధ వాతావరణం, ముడిచమురు ధరల హెచ్చుతగ్గులు కొంత ఆందోళన కలిగిస్తున్నప్పటికీ.. వేగవంతమైన భూసేకరణ, సులువైన ప్రభుత్వ అనుమతులు, నమ్మకమైన విద్యుత్ సరఫరా లభిస్తే భారత ఆర్థిక వృద్ధిని మరింత వేగంగా ముందుకు నడిపిస్తాయని నివేదిక పేర్కొంది.

పేదరికం నుంచి అభివృద్ధి పథం వైపు భారత్

విశ్వంభర, బిజినెస్ బ్యూరో : భారత ఆర్థిక పురోగతిని కేవలం ఆ దేశం ప్రస్తుతం ఎంత పేదరికంలో లేదా ధనిక దేశంగా ఉందనే దాని ఆధారంగా కాకుండా, అక్కడి ప్రజల జీవన ప్రమాణాలు ఎంత వేగంగా మెరుగుపడుతున్నాయనే కోణంలో చూడాలని దక్షిణ కొరియాకు చెందిన ప్రముఖ ఆర్థికవేత్త క్యుంగ్‌హూన్ కిమ్ అభిప్రాయపడ్డారు. కొరియా ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ పాలసీ (కేఐఈపీ) నిపుణులైన కిమ్.. గత మూడు దశాబ్దాలుగా, ముఖ్యంగా గత 10 ఏళ్లలో భారత్‌లో జరిగిన వేగవంతమైన ఆర్థిక పరివర్తనకు అంతర్జాతీయంగా మరింత గుర్తింపు రావాలని వ్యాఖ్యానించారు. 1990లో అల్పఆదాయ దేశాల సగటు కంటే కేవలం 15 శాతం మాత్రమే ఎక్కువగా ఉన్న భారత తలసరి జీడీపీ, 2025 నాటికి ఏకంగా నాలుగు రెట్లకు పైగా పెరిగి 2,702 డాలర్లు(రూ. 2.56 లక్షలు) కొనుగోలు శక్తి ప్రమాణాల ప్రకారం 11,784 డాలర్ల(రూ. 11.20 లక్షల)కు చేరుకుంది. చైనా, వియత్నాం వంటి మధ్యఆదాయ దేశాలతో పోల్చినా, వాటి సగటులో 64 శాతానికి భారత్ చేరుకోవడం గత దశాబ్దంలో సాధించిన అసాధారణ వృద్ధికి నిదర్శనమని ఆయన వెల్లడించారు. భారత్ సాధించిన ఈ ఆర్థిక వృద్ధిలో అత్యంత కీలకమైన ఫలితం పేదరికం గణనీయంగా తగ్గడమేనని కిమ్ స్పష్టం చేశారు. రోజుకు 4.40 డాలర్ల(రూ. 420) ఆదాయ ప్రాతిపదికన చూస్తే.. 2004లో 73 శాతంగా ఉన్న భారత పేదరిక రేటు, 2023 నాటికి 14 శాతానికి పడిపోయింది. అంటే కేవలం రెండు దశాబ్దాల వ్యవధిలోనే దాదాపు 62.7 కోట్ల మంది భారతీయులు పేదరికం నుంచి బయటపడ్డారు. ధనిక దేశాలలో ఆర్థిక వృద్ధి మందగించిన సమయంలో, భారత్ స్థిరంగా వృద్ధి నమోదు చేస్తూ అధికఆదాయ దేశాలతో ఉన్న అంతరాన్ని 6 శాతం నుంచి 17 శాతానికి తగ్గించుకోగలిగింది. 140 కోట్ల భారీ జనాభా ఉన్న దేశం అనేక సవాళ్లను అధిగమిస్తూ, మధ్యకాలిక వృద్ధి అవకాశాలలో ఇంతటి సానుకూల దృక్పథాన్ని కనబరచడం అభినందనీయమని ఆయన కొనియాడారు.

అక్టోబర్‌లో రూ. 52,100 కోట్ల నిధులు తీసుకెళ్లిన విదేశీ ఇన్వెస్టర్లు

విశ్వంభర, బిజినెస్ బ్యూరో: అంతర్జాతీయంగా పెరుగుతున్న ముడిచమురు ధరలు, అమెరికా బాండ్ల రాబడులు, బలపడిన డాలర్ కారణంగా భారతీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ) అమ్మకాల ఒత్తిడి కొనసాగుతోంది. సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ లిమిటెడ్ (సీడీఎస్‌ఎల్) తాజా డేటా ప్రకారం, అక్టోబర్ నెలలో ఇప్పటివరకు ఎఫ్‌పీఐలు ఏకంగా రూ. 52,100 కోట్ల విలువైన షేర్లను విక్రయించి నిధులను వెనక్కి తీసుకున్నారు. సెప్టెంబర్‌లో జరిగిన రూ. 35,861 కోట్ల విక్రయాల తర్వాత ఇది ఇంకా ఎక్కువ కావడం గమనార్హం. దీంతో 2026లో ఇప్పటివరకు భారతీయ ఈక్విటీల నుండి ఎఫ్‌పీఐ మొత్తం ఉపసంహరణ రూ. 3.12 లక్షల కోట్లకు చేరుకుంది, ఇది 2025 ఆసియా సగటు ఉపసంహరణ అయిన రూ. 1.66 లక్షల కోట్ల కంటే దాదాపు రెట్టింపు. అమెరికాలో ద్రవ్యోల్బణం స్థిరంగా ఉండటంతో అక్కడ వడ్డీ రేట్ల పెంపుపై అంచనాలు పెరిగి యూఎస్ ఆస్తులు ఆకర్షణీయంగా మారడం, ఉత్తరాసియా మార్కెట్లలో ఏఐ కంపెనీల వైపు నిధులు మళ్లడమే ఈ భారీ ఉపసంహరణకు ప్రధాన కారణం. అయితే, ఫైనాన్షియల్ సర్వీసెస్, చమురు సంబంధిత కంపెనీల షేర్లలో విదేశీ ఇన్వెస్టర్లు విపరీతంగా అమ్మకాలు సాగిస్తుండగా, కన్స్యూమర్ సర్వీసెస్, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు, ఎంటర్‌టైన్‌మెంట్, హెల్త్‌కేర్ రంగాల్లోకి మాత్రం పెట్టుబడులను తెస్తున్నారు.

పండుగల సీజన్ వేళ ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ కఠిన ఆదేశాలు

విశ్వంభర, బిజినెస్ బ్యూరో: దేశంలో పండుగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని, ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ) ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లకు (ఎఫ్‌బీఓ) కఠినమైన ఆదేశాలు జారీ చేసింది. ఖోయా, పనీర్, మాంసం, చేపలు వంటి త్వరగా పాడైపోయే ఆహార పదార్థాలను సేకరణ దశ నుండి తుది వినియోగదారునికి చేరే వరకు పరిశుభ్రమైన వాతావరణంలో, సరైన ఉష్ణోగ్రతలో నిల్వ చేయడం, ప్యాక్ చేయడం, రవాణా చేయడం తప్పనిసరి అని స్పష్టం చేసింది. ఈ ఉత్పత్తులను రవాణా చేసేటప్పుడు గోనె సంచులు లేదా ఫుడ్‌గ్రేడ్ కాని ప్లాస్టిక్ కవర్లను వాడకూడదని, కేవలం శుభ్రమైన మూత ఉన్న వాహనాలు, నాణ్యమైన ప్యాకేజింగ్ మెటీరియల్ మాత్రమే ఉపయోగించాలని ఆదేశించింది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్, 2006 నిబంధనల ప్రకారం.. రవాణా, నిల్వ సమయంలో ఉష్ణోగ్రతల నిర్లక్ష్యానికి పాల్పడినా, సరుకు రవాణా పత్రాలను సమర్పించకపోయినా లేదా పరిశుభ్రతా ప్రమాణాలను ఉల్లంఘించినా సదరు ఆహార ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని నిర్వీర్యం చేయడంతో పాటు కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ మేరకు దేశవ్యాప్తంగా వ్యాపారాల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని రాష్ట్ర ఆహార భద్రతా కమిషనర్లు, రైల్వే అధికారులు, ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ ప్రాంతీయ డైరెక్టర్లను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అమిత్ శర్మ ఆదేశించారు.

ఎస్‌యూవీల మోజులో భారతీయులు

విశ్వంభర, బిజినెస్ బ్యూరో: దేశంలో వాహన కొనుగోలుదారుల ఆలోచనా విధానంలో కీలక మార్పులు కనిపిస్తున్నాయి. ఎంట్రీలెవల్ చిన్న కార్ల కంటే అధునాతన ఫీచర్లు ఉన్న ఎస్‌యూవీ మోడళ్ల వైపు వినియోగదారులు విపరీతంగా మొగ్గు చూపుతున్నారని ఓ నివేదిక తెలిపింది. క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీ 'ట్రాన్స్‌యూనియన్ సిబిల్' విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం.. 2019 ప్రథమార్థంతో పోలిస్తే 2026 మొదటి ఆరు నెలల నాటికి దేశంలో సగటు ప్యాసింజర్ వాహన రుణ పరిమాణం ఏకంగా 49 శాతం పెరిగి రూ. 8.2 లక్షలకు చేరుకుంది. పెరిగిన వాహన ధరలు, అధిక ఫీచర్లు ఉన్న ప్రీమియం మోడళ్లను ఎంచుకోవడమే ఈ రుణాల పెరుగుదలకు కారణమని నిపుణులు భావిస్తున్నారు. రిగిన రుణ మొత్తాలను సులభంగా తిరిగి చెల్లించేందుకు కొనుగోలుదారులు ఎక్కువ టెన్యూర్‌ను ఎంచుకుంటున్నారు. 2019లో సగటు రుణ కాలపరిమితి 57 నెలలు ఉండగా, ప్రస్తుతం అది 62 నెలలకు (ఐదేళ్లకు పైగా) పెరిగింది. అధిక రుణ మొత్తాల భారం పడకుండా నెలవారీ ఈఎంఐని తగ్గించుకోవడానికే రుణగ్రహీతలు ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారు. ప్రస్తుతం దేశంలో యాక్టివ్ ప్యాసింజర్ వాహన రుణగ్రహీతల సంఖ్య 2.5 కోట్లకు చేరుకోగా, బ్యాంకులు లేదా ఆర్థిక సంస్థల నుండి తీసుకున్న అప్పులను (రుణాలను) సకాలంలో, పద్ధతి ప్రకారం తిరిగి చెల్లించే అలవాటు కూడా ప్రజల్లో మెరుగుపడింది. 90 నుండి 179 రోజుల బకాయిలు ఉన్న రుణాల శాతం 0.5 శాతానికి పడిపోవడం బ్యాంకింగ్ రంగానికి సానుకూలం.

గ్రామీణ మార్కెట్ల హవా..

వాహనాలను కొనాలనే కోరిక కేవలం పెద్ద నగరాలకే పరిమితం కాలేదు. 2026 ప్రథమార్థంలో మంజూరైన అధిక విలువ గల కార్ లోన్లలో ఏకంగా 51 శాతం వాటా సెమీఅర్బన్, గ్రామీణ ప్రాంతాల కొనుగోలుదారులదే కావడం విశేషం. గ్రామీణ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల నుండి నేరుగా కార్లకు మారే వారి సంఖ్య 15 శాతం వార్షిక వృద్ధి రేటుతో పుంజుకుంది. దీనికితోడు యూజ్డ్ కార్ (సెకండ్ హ్యాండ్) ఫైనాన్సింగ్ మార్కెట్ కూడా వేగంగా విస్తరిస్తోంది. మొత్తం రూ. 11 లక్షల కోట్ల కార్ లోన్ పోర్ట్‌ఫోలియోలో దాదాపు రూ. 2.5 లక్షల కోట్లు కేవలం సెకండ్ హ్యాండ్ కార్ల ఫైనాన్సింగ్‌కే పరిమితమై ఉంది.

ఆటో ఫైనాన్సింగ్‌లో ఎన్‌బీఎఫ్‌సీల హవా..

వాహన ఫైనాన్సింగ్ విభాగంలో బ్యాంకేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీ) తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంటున్నాయి. ద్విచక్ర వాహన రుణాల మార్కెట్లో ఎన్‌బీఎఫ్‌సీల వాటా 73 శాతానికి పెరగ్గా, ప్యాసింజర్ వాహన విభాగంలో 37 శాతానికి చేరింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు 30 శాతం, ప్రైవేట్ బ్యాంకులు 26 శాతం వాటాను కలిగి ఉన్నాయి. కాగా, మార్కెట్లో మొదటిసారి రుణాలు తీసుకునే వారి కంటే రెండేళ్లకు పైగా మెరుగైన క్రెడిట్ హిస్టరీ ఉన్న కొనుగోలుదారులే ఎక్కువగా వాహన రుణాలు పొందుతున్నారు. ఇది భారతీయుల కొనుగోలు శక్తి మాత్రమే కాకుండా, ఆర్థిక పరిణతిని కూడా స్పష్టం చేస్తోంది.